



# మనం

చిత్తూరు | తిరుపతి | శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

4 పేజీలు

సోమవారం 4, నవంబరు 2024





### తిరుపతి..చిత్తూరు జిల్లాల పోలీసు అధికారులతో

# హోంమంత్రి శాంతి భద్రతలపై సమీక్ష




**పోలీసు పనితీరు భవిష్యత్ వ్యూహాలు కార్యాచరణ నేర నివారణ నియంత్రణ మరియు సమర్థవంతమైన పోలీసింగ్ ముఖ్య లక్ష్యం.**

**ఎవరైనా తప్పు చేయాలంటే భయపడేటట్లు పోలీసులు పని చేయాలి.**

**లేటెస్ట్ టెక్నాలజీని పోలీస్ శాఖలో ఇనుమడింపజేసి స్మార్ట్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తాం.**

**ఆడపిల్లల కేసు విషయంలో చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించాలి.**

**ఏదైనా ఘటన జరిగిన వెంటనే పోలీసులు స్పందించి, నిజానిజాలు ప్రజలకు తెలియజేయాలని, భవిష్యత్తులో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమర్థవంతంగా పని చేయాలి.**

**సోషల్ మీడియాపై నిఘా పెంచేందుకు ప్రతి జిల్లాలో సైబర్ పోలీస్ స్టేషన్ లు ఏర్పాటు.**

**క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పోలీసుల యొక్క సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు.**

**రాష్ట్ర హోం మంత్రివర్యులు శ్రీమతి వంగలపూడి అనిత**

తిరుపతిటౌన్, నవంబర్ 3: పద్మావతి మహిళా యూనివర్సిటీ సావేరి సెమినార్ హాల్ లో తిరుపతి, చిత్తూరు జిల్లాల పోలీస్ అధికారులతో ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలపై రాష్ట్ర హోం మంత్రివర్యులు వంగలపూడి అనిత గారు సమీక్ష సమావేశం నిర్వహించి, అనుసరించవలసిన కార్యాచరణ పై దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర శాంతి భద్రతల ఐజి సి. హెచ్. శ్రీకాంత్ అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షేముషి తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మరియు చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు, వారు పాల్గొని, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలు అమల వుతున్న విధివిధానాల గురించి రాష్ట్ర గౌరవ హోం మంత్రి వివరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ,లి ఆడపిల్లలు, మహిళలపై అఘాయిత్యాల నిర్మూలనకు ప్రత్యేక దృష్టి సారించాం.గంజాయి, ఎర్రచందనం వంటి స్మగ్లింగ్ నియంత్రణకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తాం. పోలీసు వ్యవస్థను సాంకేతికంగా బలోపేతం చేసి, నేరస్తులను కట్టడి చేస్తాం.ముఖ్యంగా పిల్లలపై అఘాయిత్యాలు నిర్మూలన ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నది.అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలకు పాల్పడుతున్న వారిని కట్టడి చేస్తాము. అత్యాధునిక సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం.. వీటి ద్వారా దేవాలయాలు, ఆసుపత్రులు, మసీదులు, పాఠశాలలు, కళాశాలలు మొదలగు చోట్ల ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం. చెక్పోస్టుల వద్ద డ్రోన్స్, సీసీ కెమెరాలు తో నిరంతర నిఘా పెట్టి గంజాయి ఇసుక ఎర్రచందనం వంటివి స్మగ్లింగ్ జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటాం. ప్రతి సబ్ డివిజన్ కు బేసిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ తో కూడిన నైట్ విజన్ డ్రోన్స్ ను అందుబాటులో ఉంచుతున్నాం. మహిళల సంబంధిత నేరస్తులపై చాలా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ప్రజలకు జవాబుదారుతనంగా పోలీస్ వ్యవస్థ మరియు ప్రభుత్వం పని చేస్తున్నది. క్షేత్రస్థాయిలో పోలీసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు సవాళ్లు గురించి, టెక్నాలజీ బలోపేతం చేసే విధానం గురించి, నేర నియంత్రణ కోసం అనుసరించాల్సిన కార్యాచరణ గురించి పోలీసు అధికారుల నుండి సూచనలను తీసుకున్నాం. వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం తరఫున ముందుకు వెళ్తాం.

నేర నియంత్రణ చేయడంలో గాని, మహిళలు/ పిల్లల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారి పట్ల గాని, హత్యలు ఆత్మహత్యలు ప్రేరేపించే వారి పట్ల కఠినంగా వ్యవహరించి..వారు నేరం చేయాలంటే భయపడే విధంగా క్రియాశీలకంగా సమర్థవంతంగా పనిచేసే విధంగా కార్యాచరణను చర్చించాం, అని రాష్ట్ర హోం మంత్రివర్యులు వంగలపూడి అనిత తెలిపారు.



## అట్టహాసంగా భూమన ప్రమాణ స్వీకార మహోత్సవం..

**వేలాదిగా తరలివచ్చిన వైసీపీ కార్యకర్తలు, నాయకులు**

**ఒకే వేదికను పంచుకున్న పార్టీ అతిరథ మహారథులు**

**పార్టీ ముఖ్యులందరికీ సాదర స్వాగతం పలికిన మోహిత్ రెడ్డి**

**2027లో జగన్ ముఖ్యమంత్రి కావడం తథ్యం: విజయ సాయిరెడ్డి**

**'బాబు' పాలనలో నేరగాళ్లు బరితెగించారు: సజ్జల**

**చంద్రగిరిలో మోహిత్ ఓటమికి 25 మంది ఏకమయ్యారు: చెవిరెడ్డి**

**కార్యకర్తల సంక్షేమం, పార్టీ బలోపేతమే తమ లక్ష్యం: భూమన**



తిరుపతి నవంబరు 3 మనం న్యూస్: "ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన భూమన కరుణాకర్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలోని ఓ ప్రయివేటు స్థలంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు వైసీపీ కార్యకర్తలు, నాయకులు వేలాదిగా తరలివచ్చారు. చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్ చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన

2లో



## ప్రభుత్వ విధులలో ఉన్న సిబ్బందిపై దాడి చేయడం సరికాదు

**రాష్ట్ర అదనపు కార్యక్రమ అధికారుల సంఘం**

తిరుపతి,03 నవంబర్,మనం న్యూస్: ప్రభుత్వ విధులలో ఉన్న సిబ్బందిపై దాడులు చేయడం సరికాదని రాష్ట్ర అదనపు కార్యక్రమ అధికారుల సంక్షేమ సంఘం సభ్యులు పేర్కొన్నారు. అక్టోబరు నెల 30వ తేదీ బుధవారం రోజున తిరుపతి జిల్లా కోట మండలానికి చెందిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అదనపు కార్యక్రమ అధికారి పూర్ణిమ పై కోట మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన ప్రసాద్ గౌడ్ అనే వ్యక్తి ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి మా గ్రామంలో ఉపాధి హామీ పనులు ఎందుకు కల్పించడం లేదని అడిగారు. అందులకు అదనపు కార్యక్రమ అధికారి పూర్ణిమ సమాధానం చెబుతూ అన్ని కాలువల్లో నీళ్లు ఉన్నాయని నీళ్లు తగ్గగానే పనులు కల్పిస్తామని తెలిపారు. ఆ సమాధానం నచ్చని ప్రసాద్ గౌడ్ తనతోపాటు వచ్చిన ఉపాధి కూలీలతో అక్కడ విధులలో ఉన్నటువంటి ఏపీవోను దుర్భాషలాడుతూ దాడి చేయడంతో పాటుగా దుర్భాషలాడటం చేయడం జరిగింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర అదనపు కార్యక్రమ అధికారుల సంక్షేమ సంఘం స్పందిస్తూ ప్రభుత్వ విధులలో ఉన్న సిబ్బందిపై ఇటువంటి దాడులు చేయడం సరికాదని ఈ విషయాన్ని రాష్ట్ర అదనపు కార్యక్రమ అధికారుల సంఘం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సిబ్బందిపై కూలీలను దాడికి ఉసిగొలిపిన ప్రసాద్ గౌడ్ ను తక్షణమే శిక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకొని వెళతామని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు మరల పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర అదనపు కార్యక్రమ అధికారుల సంఘం తరఫున కోరుచున్నామని తెలిపారు.



## మంత్రులు, ఎమ్మెల్యేలకు వేమిరెడ్డి దంపతుల ఆత్మీయ ఆతిథ్యం

నెల్లూరు, మనం న్యూస్, (కార్పోరేషన్): జిల్లా రివ్యూ కమిటి సమావేశంలో పాల్గొనేందుకై తొలిసారిగా నెల్లూరు నగరానికి విచ్చేసిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి ఎన్ ఎం డి ఫారూఖ్ గారికి వేమిరెడ్డి దంపతులు ఆత్మీయ ఆతిథ్యం యిచ్చారు. ఇన్చార్జ్ మంత్రి ఎన్ ఎం డి ఫారూఖ్ గారితో పాటు జిల్లా మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణతో పాటు కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణా రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు వేమిరెడ్డి నివాసానికి విచ్చేసారు. భోజన అనంతరం ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కావ్య కృష్ణా రెడ్డి, ఇంటూరి నాగేశ్వర రావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గార్లు తమ నియోజకవర్గాలలో సమస్యలను మంత్రుల దృష్టికి తెచ్చారు. సుహృద్భావ వాతావరణంలో జరిగిన ఆత్మీయ చర్చల్లో పార్టీకి సంబంధించిన విషయాలతో పాటు పంచాయతీరాజ్ శాఖ ద్వారా పల్లె పండుగ పేరిట పంచాయతీలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యేలు మంత్రులకు వివరించారు. సావధానంగా విన్న మంత్రులు బడ్జెట్ సమావేశాల అనంతరం అభివృద్ధి పనులకు నిధుల అందచేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మంత్రులతో కలిసి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే జిల్లా రివ్యూ కమిటి మీటింగ్ లో వేమిరెడ్డి దంపతులు పాల్గొన్నారు.



## జెడ్పీ కార్యాలయంలో రైతు సమస్యలపై ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, మనం న్యూస్: కావలి నియోజకవర్గం రైతుల సమస్యలపై జెడ్పీ కార్యాలయంలో డిస్ట్రిక్ రివ్యూ కమిటీ మీటింగ్ లో రైతుల కష్టాలపై ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తన గళం విప్పారు. కావలి నియోజకవర్గ పరిధిలో అనేక కాలువలు పూడిపోయి ఉన్నాయి అని, మైనర్ ఇరిగేషన్ అధికారులు పనుల్లో జాప్యం చేస్తున్నారు అని మాట్లాడారు. చెరువులకు సంబందించి కలుజులు దెబ్బతిని ఉన్నాయని, ఇరిగేషన్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి అన్నారు. చెరువులు, కాలువల మీద ప్రతి ఏడాది ఆరు నెలలపాటు లస్కర్లు పనిచేస్తుంటారని, వారికి ఓఎంఆర్ ఫండ్స్ ద్వారా జీతాలు చెల్లించే ఆనవాయితీ ఉంది అన్నారు. వెంటనే వారికి జీతాలు చెల్లించకుంటే, సక్రమంగా పంటలకి నీరందే పరిస్థితి ఉండదు అన్నారు. కావలి నియోజకవర్గంలో 73 మైనర్, పంచాయితీ రాజ్ చెరువులు ఉన్నాయి. ఇటీవల భారీ వర్షాల వల్ల చాలా చెరువులకి గండ్లు పడే పరిస్థితి వచ్చింది. వెంటనే మరమ్మత్తులు చేపట్టాల్సిన అవసరం ఉంది. మేజర్ ఇరిగిషేన్ విభాగం పనిచేసినంతగా, మీడియమ్, మైనర్ ఇరిగేషన్ విభాగాలు పనిచేయడం లేదు. రైతులకి నీళ్లించేందుకు చెరువుల కలుజులు సరిలేవు. ఇంజన్లతో తోడాల్సిన పరిస్థితి ఉంది. ఎఫ్ డి ఆర్, ఎన్ఆర్ఈజీఎస్, ఓఎంఆర్ నిధుల నుంచి అయినా నిధులు ఇవ్వాలి. కావలి చెరువు కిందే 25 వేల ఎకరాల్లో వరి సాగవ్వాల్సి ఉందని, ఎమ్మెల్యేకావ్య క్రిష్ణారెడ్డి సమావేశంలో పేర్కొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో పేద ఆయాలపై

# చోటా కూటమి నాయకుల కర్ర పెత్తనం..!?

**ప్రభుత్వ పాఠశాలల్లో పేద ఆయాలపై చోటా కూటమి నాయకుల కర్ర పెత్తనం..!?**

**అయ్యప్పరెడ్డిపాలెం పాఠశాలలో అకారణంగా ఆయాను తొలగించేందుకు రంగం సిద్ధం.**

**అకారణంగా తొలగించే విషయంపై విచారణ చేపడతాం... ఎంఈఓ మునిరత్నం**



నాయుడుపేట, నవంబర్ 3, మనం న్యూస్: ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు ప్రభుత్వం ఆయా వ్యవస్థను తీసుకువచ్చింది. ఈ వ్యవస్థ ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా వ్యవస్థ విజయవంతంగా నిర్వహించబడుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇస్తుండడంపై వారి జీవనం సజావుగా సాగుతుంది. ఆయా వ్యవస్థలో పనిచేసే ఎక్కువ శాతం మహిళలు పేదవారే ఉండడం గమనార్హం. అయితే ఆ పేద మహిళా ఆయాలపై చోటా కూటమి నాయకుల కొంతమంది కర్ర పెత్తనం చలాయిస్తూ కడుపు కొట్టేందుకు సిద్ధపడ్డ విషయం తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం అయ్యప్పరెడ్డిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. అయ్యప్పరెడ్డిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో గత కొద్ది సంవత్సరాల నుంచి ఓ మహిళ ఆయాగా విధులు నిర్వహిస్తుంది. విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు పాఠశాలలో ఎలాంటి సమస్యలు లేకుండా పనిచేస్తున్నట్లు సమాచారం. అయితే ఆ మహిళ ఆయాను అకారణంగా తొలగించేందుకు కొంతమంది కూటమి ప్రభుత్వం పేరు చెప్పుకుంటూ పబ్బం గడుపుకుంటున్న చోటా నాయకులు సిద్ధపడినట్లు సమాచారం. నియోజకవర్గంలో ప్రభుత్వ పెద్దలు అకారణంగా పేద ఆయాల కడుపు కొట్టొద్దని చోటా నాయకులకు సూచించినట్లు సమాచారం. అయితే కొంతమంది చోట నాయకులు ప్రభుత్వ పెద్దల మాటలను ధిక్కరించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ చోటా నాయకులు వ్యవహార శైలి వల్ల ప్రభుత్వ పెద్దలకు చెడ్డ పేరు వచ్చే దిశగా ఉందని ప్రజలు చర్చించుకోవడం విశేషం. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే దిశగా ప్రవర్తిస్తున్న అయ్యప్పరెడ్డిపాలెం గ్రామ చోట నాయకుల వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయ్యప్ప రెడ్డి పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఆయా చోటా నాయకులకు సలాం కొట్టడం లేదని ఆమెను అకారణంగా తొలగించేందుకు పాఠశాల ప్రధానో పాధ్యా యులపై ఒత్తిడి తీసుకొచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల అభివృద్ధి కొరకు పనిచేయాల్సిన చోట నాయకులు మహిళ ఆయాపై సలాం కొట్టలేదని కర్ర పెత్తనం చెలాయించి కడుపు కొట్టడం ఎంతవరకు సమంజసమని గ్రామంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వాలు మారుతూ ఉంటాయి అలా అని పేదల కడుపు కొట్టడం ఏమిటని గ్రామ ప్రజలు చోటా నాయకులు వ్యవహార శైలిపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పై ఒత్తిడి తీసుకొచ్చి సోమవారం ఆయాను తొలగించేందుకు రంగ సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఆయాకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా సోమవారం తొలగించేందుకు ఇటు ప్రధానోపాధ్యాయులు అటు చోటా కూటమి నాయకులు సిద్ధపడినట్లు సమాచారం. ఆయాను అకారణంగా తొలగించే విషయంలో ప్రధానోపాధ్యాయులు నియంత ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానోపాధ్యాయులకు స్వంత పనులు చేయడం లేదనే అక్కస్సుతో కూటమిలో ఉన్న చోటా నాయకులను రెచ్చగొట్టిందనే వాదన బలంగా వినిపిస్తుంది. పేద పిల్లల పట్ల ప్రధానోపాధ్యాయులు ఏకపక్షంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటి ధోరణితోనే పేదలంటే పడని ప్రధానోపాధ్యాయులు ఆయాను తొలగించి ప్రక్రియకు పూనుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా కూటమిచోట నాయకులు సలాం కొట్టలేదనే పేదల కడుపు కొట్టడం సమంజసం కాదని అకారణంగా ఆయాను తొలగించే ప్రక్రియను మానుకుని గ్రామ అభివృద్ధి కోసం

4లో

## ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత





**జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ ఎం డి ఫరూక్**

నెల్లూరు, మనం న్యూస్: ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సమీక్ష మండలి సమావేశం జిల్లా ఇన్చార్జి మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ సమావేశంలో అనేక ముఖ్యమైన శాఖల పనితీరును కూలంకషంగా చర్చించడం జరిగిందని, ఇక్కడ తీసుకున్న నిర్ణయాలను ఆచరణ చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్ పై ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అన్నివిధాల అందుబాటులో వుండి ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి చెప్పారు. ఇది మంచి ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అని ఆయన పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా ఇన్చార్జి మంత్రిగా తనను నియమించినందున సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులందరూ హాజరై సహకరించారని, అందుకు అందరికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సగౌరవంగా ఆహ్వానం పలకడం పొరపాటు జరిగిందని, ఇది బాధాకరమైన విషయమని, దీనికి అందరం చింతిస్తున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

**ఎంపీ వేమిరెడ్డికి అందరి తరపున క్షమాపణ చెబుతున్నాం : మంత్రి ఆనం**

డిఆర్‌సి సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి

5లో

# మళ్ళారపల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశం

**130 రోజుల కూటమి ప్రభుత్వం పని తీరుపై ఆత్మీయ సమావేశంలో ఆసక్తికర చర్చ**

**ఆత్మీయంగా పలకరించుకున్న నేతలు**

**కార్యకర్తలకు పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ దిశానిర్దేశం**





ఐరాల నవంబర్ 3 మనం న్యూస్.పూతలపట్టు నియోజకవర్గంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఐరాల మండలం, మళ్ళారపల్లె గ్రామంలో గల ఐరాల మండల టిడిపి అధ్యక్షుడు గిరిధర్ బాబు గారి నివాసంలో ఈ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశంలో పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ శ్రీ కలికిరి మురళీమోహన్ గారు ప్రత్యేకించి కార్యకర్తలతో ముచ్చటించారు. చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని గారు, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ నాయుడు గారు, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సి.ఆర్.రాజన్ గారితో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు ఆత్మీయ సమావేశంలో పాల్గోనగా, 130 రోజుల కూటమి ప్రభుత్వం పాలనపై ఆత్మీయ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, కేంద్ర ప్రభుత్వం సహకారం పూర్తి స్థాయిలో అందుతుందని నేతలు అభిప్రాయ పడ్డారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న తీరుపై ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, కూటమి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెరిగిందని కార్యకర్తలు నేతల దృష్టికి తీసుకెళ్ళారు. అలాగే నియోజకవర్గాల్లోని సమస్యలను ఇంఛార్జ్ , ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్ళారు. పూతలపట్టు నియోజకవర్గంలోనూ కూటమి ప్రభుత్వం హయాం నుండి అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని, అందుకు సహకరిస్తున్న కార్యకర్తలకు పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ గారు ధన్యవాదాలు తెలిపారు. పూతలపట్టు నియోజకవర్గంలో ఎక్కడైనా సరే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా తన దృష్టి తీసుకురావాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. మీరు ఎమ్మెల్యేగా భాధ్యతలు తీసుకున్నప్పటి నుండి నియోజకవర్గ ప్రజల్లో ఒక నమ్మకం ఏర్పడిందని, ఐదు మండలాల్లో అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అందుతుందని కార్యకర్తలు ఎమ్మెల్యే మురళీమోహన్ గారికి తెలిపారు. అందరూ కలిసి కట్టుగా పని చేయాలని, కూటమి ప్రభుత్వంపై మరింత నమ్మకం కలిగించే కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు మురళీమోహన్ గారు దిశానిర్దేశం చేశారు. ఒక పండుగ వాతావరణంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఆత్మీయ సమావేశంలో ఒకరికి ఒకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాము చేసి ప్రయత్నాలను కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ గారు ప్రతి ఒక్కరిని పేరు పెట్టి పిలుస్తూ వారితో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ముఖ్య నేతలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

# మొగిలి ఘాట్ లో ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేస్తాం..

**పలమనేరు డిఎస్పి ప్రభాకర్.**







బంగారుపాళ్యం నవంబర్ 3. మనం న్యూస్: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం మొగిలి ఘాట్లో ప్రమాదాలను నియంత్రించేందుకు తగు చర్యలు తీసుకోనున్నట్లు పత్రికా ముఖంగా ఆదివారం మొగిలి ఘాట్లో పలమనేరు డిఎస్పి ప్రభాకర్ తెలిపారు. గత రెండు నెలల వ్యవధిలోనే బస్సు లారీలు కార్ల ప్రమాదాల్లో కొంతమంది చనిపోవడం జరిగిందని ఇది మనందరిలో బాధాకరంగా నిలిచిపోయే విషయమని, ఇలాంటి సంఘటనలు మరల పునరావతం కాకుండా తగు చర్యలు తీసుకోనున్నట్లు డీఎస్పీ తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు, ఎస్పీ మణికంఠ చందోలు ఆర్డీవో తదితరులు పరిశీలించిన తర్వాత ప్రమాదాల ప్రదేశాల్లో పోలీస్ ఎస్కార్ట్ ను, ఎక్కువ ప్రమాదాలు జరిగేచోట స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలియజేశారు. హైవే మొబైల్ పెట్రోలింగ్ ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నెమ్మదిగా వెళ్ళమని మైక్ అనౌన్స్మెంట్ కూడా చేసే విధంగా ఏర్పాటు చేసినట్లు డిఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ సిఐ కే శ్రీనివాసులు, ఏఎస్ఐ మల్లప్ప, హెడ్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్, కానిస్టేబుల్ రమేష్, దావూద్ భాయ్, హోంగార్డులు రామ్మూర్తి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు

# అట్టహాసంగా భూమన ప్రమాణ స్వీకార మహోత్సవం..





**(మొదటి పేజీ తరువాయి)**

సభకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అతిరథ మహారథులు అందరూ హాజరై నూతన అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి సారథ్యంలో పార్టీ బలపడాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అందరూ ఒకే వేదికను పంచుకుని కూటమి సర్కారుపై ఘాటు విమర్శలు చేశారు. వేలాదిగా తరలి వచ్చిన పార్టీ కార్యకర్తలు, నాయకుల ఉత్సాహాన్ని చూసిన పార్టీ ప్రముఖులు అందరూ జగనన్న నిజంగా ఓడిపోలేదని అంతా ఈవీఎంల మాయగా ఉందన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. చంద్రగిరిలో వైసీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఓడించడానికి అంగ బలం, ఆర్థిక బలం కలిగిన 25మంది ఏకమై సర్వశక్తులు ఒడ్డారని, అనునిత్యం ప్రజల సంక్షేమం కోసం పనిచేసిన తనపై తప్పుడు ప్రచారాలతో ప్రజలను నమ్మించి అబద్ధాలతో పులివర్తి నాని అధికారం చేపట్టారని రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి ఘాటుగా విమర్శలు చేశారు. అంతకు ముందు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ తమ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఎంతటి వారినైనా వదిలేది లేదని, ఎంత వరకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఉద్యమ స్ఫూర్తితో రాజకీయాలు చేసే భూమన కరుణాకర్ రెడ్డి నాయకత్వంలో తమ పార్టీ బలోపేతమై జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ జెండా ఎగురుతుందన్న బలమైన నమ్మకం తనకుందన్నారు. భూమన ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని అన్నీ తామై నడిపించిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వేదికమీదకు వచ్చిన అతిరథ మహారథులు అందరికీ సాదరంగా స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందించారు. "

గత ఎన్నికల్లో కూటమి పార్టీలు, పచ్చ మీడియా సంస్థలు అన్నీ ప్రజలు అందరికీ మంచి చేసే జగన్మోహన్ రెడ్డిపై తప్పుడు ప్రచారం పదే, పదే చేయడం వల్ల ప్రజలు నమ్మారని, వారిచ్చిన హామీలకు ఆకర్షితులై అధికారం ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా జగన్మోహన్ రెడ్డి పేదలకు పంచే సంక్షేమ పథకాలను నిలిపివేయడంతో మోసపోయినట్లు జనం గుర్తించారన్నారు. మోసంతో వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగే పరిస్థితి లేదని, 2027లో జరిగే జమిలి ఎన్నికలతో మరోసారి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవడం ఖాయమని ఎంపీ విజయ సాయిరెడ్డి స్పష్టం చేశారు. అలాగే తిరుపతి శాసనసభ్యునిగా, టీటీడీ ఛైర్మన్ గా భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతి నగర వాసులకు వెలకట్టలేని సేవలు అందించారన్నారు. తిరుపతి రూపు రేఖలు మార్చేలా ఆయన కుమారుడు అభినయ్ రెడ్డి రహదారుల విస్తరణ చేయడం వల్ల ఈ రోజు తిరుపతిలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండాపోయిందన్నారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసి గతంలో కార్యకర్తలను విస్మరించామన్న మాటలు పునరావృతం కాకుండా అందరికీ మంచి జరగాలన్న ఆలోచనతో జగన్మోహన్ రెడ్డి భూమన కరుణాకర్ రెడ్డిని జిల్లా పార్టీ అధ్యక్షులుగా నియమించడం జరిగిందన్నారు. ఆయన సారథ్యంలో పార్టీ మరింత బలపడుతుందని, వచ్చే ఎన్నికల్లో అత్యధిక స్థానాలను పార్టీ చేజిక్కించుకుంటుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. అనంతరం సజ్జల రామక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ బాబు పాలనలో పోలీసులు వైసీపీ కార్యకర్తలు, నాయకుల మీద తప్పుడు కేసులు పెట్టడానికి పరిమితమవడంతో నేరగాళ్లు బరితెగించి ప్రజల మాన, ప్రాణాలను తీస్తున్నారని విమర్శించారు. ఆడబిడ్డలకు అండగా ఉంటామని నమ్మబలికిన పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చాక ఎన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా నోరు మెదపడం లేదన్నారు. చంద్రబాబు పాలన ఒక దగాకోరు పాలనగా ఉందన్న నిజాన్ని ప్రజలు ఐదు నెలలకే గుర్తించారని, మనమంతా ఐక్యతతో పనిచేస్తే మరోసారి మన నాయకుడు జగన్మోహన్ రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. అనంతరం రాయలసీమ పార్టీ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అబద్దాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంకు అంతిమ గడియలు దగ్గరపడ్డాయన్నారు. ఐదేళ్లు పరిపాలన చేయాల్సిన కూటమి పార్టీలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పే రోజులు ముంచుకొస్తున్నాయన్నారు. అబద్దాలతో అందలమెక్కిన వారిపై తిరుగుబాటు చేయడానికి ప్రతి కార్యకర్త సంసిద్ధులవ్వాలన్నారు.



**కొత్త ప్రభుత్వం వచ్చిన ఐదు నెలలకే జగన్ వైపు చూస్తున్నారు.**

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చిన ఐదు నెలలకే జనం జగన్మోహన్ రెడ్డి వైపు చూస్తున్నారని, ప్రభుత్వం తమను మోసం చేసిందన్న ఆవేశంతో రగలిపోతున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు వెల్లడించారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు మేలు చేయడం కంటే కీడు ఎక్కువగా చేస్తోందని, అమాయకపు ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నబిడ్డ నుంచి పెద్దవారి వరకు మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే ప్రశ్నించేందుకు వచ్చానన్న పవన్ కల్యాణ్ ఎక్కడ దాక్కున్నారో బయటకు రావాలని డిమాండ్ చేశారు. పదవి చేతికి రాగానే తప్పులు కనబడలేదా..? సనాతన ధర్మ పరిరక్షణకు సాధువులా వేషం వేసి నాటకాలు ఆడిన పవన్ కల్యాణ్ మహిళ మాన, ప్రాణాలను కాపడటం కూడా సనాతన ధర్మ పరిరక్షణలో భాగమన్న విషయం తెలియదా..? అంటూ విమర్శలు చేశారు. సినిమాల్లో చేసే నాటకాలను ప్రజల ముందు చూపించి మోసం చేయడం మంచిది కాదని, సమాజ శ్రేయస్సు కోసం పనిచేయడం అలవరచుకోవాలని సూచించారు. చంద్రబాబు సర్కారును కాపాడటానికి ఎన్ని అఘాయిత్యాలు జరుగుతున్నా పవన్ కల్యాణ్ నోరు మెదపడం లేదన్న విషయాన్ని జనసైనికులు గుర్తించారని, ఇకపై ఎన్నికలు ఎప్పుడు జరిగినా కూటమి పార్టీలకు భవిష్యత్తు లేకుండా చేయడానికి జనం సిద్ధంగా వున్నారన్నారు. చిత్తూరు జిల్లా అధ్యక్షునిగా భూమన కరుణాకర్ రెడ్డి నియామకం వల్ల పార్టీ బలోపేతమవుతుందని, ప్రతి ఒక్కరు ఆయన నాయకత్వంలో కష్టపడాలని విన్నవించారు.

**ఈవిఎం ప్రొడక్షన్ తో కూటమి సర్కార్**

గత ఎన్నికల్లో జరిగిన ఈవీఎం ప్రొడక్షన్స్ తో కూటమి సర్కార్ ఏర్పడిందని మాజీ మంత్రి ఆర్.కె. రోజా విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఆడబిడ్డలకు రక్షణ లేదని, ఐదు నెలల్లో నేరగాళ్లు బరితెగించి రోడ్లపై తిరుగుతున్నా పోలీసులు ప్రతిపక్ష పార్టీ నేతల ఇళ్ల చుట్టు తిరుగుతున్నారు తప్ప వారిని శిక్షించిన దాఖలాలు లేవన్నారు. జగనన్న పాలనలో దిశ చట్టం అమలు చేయడంతో ఆడబిడ్డల జోలికి రావాలంటే నేరగాళ్లు భయపడేవారన్నారు. కూటమి పార్టీలు అన్నీ అధికారాలను పంచుకోవడం, అందినకాడికి దోచుకోవడం తప్ప రాష్ట్ర ప్రజలకు మేలు చేసిన మేలు ఏదీ లేదన్నారు. ఐదు నెలలు గడిచినప్పటికీ ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చకపోగా జగనన్న అమలు చేసిన పథకాలను కూడా ఎత్తివేయడంతో ప్రజలు కష్టాలు పడక తప్పడం లేదన్నారు. భూమన కరుణాకర్ రెడ్డికి జిల్లా పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించడం చాలా ఆనందంగా వుందన్న ఆమె పార్టీ బలోపేతానికి తాము అహర్నిశలు కష్టపడిపనిచేస్తామన్నారు. భూమన ప్రమాణ స్వీకారానికి వచ్చిన కార్యకర్తలు, నాయకుల ఉత్సాహం చూస్తుంటే చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వైసీపీకి పూర్వ వైభవం వస్తుందన్న నమ్మకం కలుగుతోందన్నారు. అడబిడ్డల ఉసురు ఊరికేపోదని, నేరస్తులకు కొమ్ముకాస్తున్న కూటమి ప్రభుత్వం పతనమవక తప్పదని హెచ్చరించారు.

**కార్యకర్తల సంక్షేమం, పార్టీ బలోపేతమే లక్ష్యం..**

ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షునిగా తన ముందు కార్యకర్తల సంక్షేమం, పార్టీ బలోపేతమే లక్ష్యంగా కనబడుతోందని భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ఎంతవరకైనా పోరాడుతానని, మహానేత రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధన, జగన్మోహన్ రెడ్డి అడుగుజాడల్లో నడుచుకుంటూ పార్టీని అన్ని విధాలుగా బలోపేతం చేస్తానన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరినీ సమన్వయం చేసుకుని ప్రతి నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి పనిచేస్తానన్నారు. ఇదే జిల్లాకు చెందిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహాయ సహకారాలు, రాయలసీమ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆలోచనలు, తన తమ్ముడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అండతో ప్రతి ఒక్కరికీ అండగా నిలబడి పోరాట పటిమతో ముందుకు వెళతానని స్పష్టం చేశారు. అంతకు ముందు మాజీ మంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ భూమన కరుణాకర్ రెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యకర్తలు, నాయకులకు న్యాయం జరుగుతుందన్నారు. సర్వేలతో కాలం వెలిబుచ్చకుండా పార్టీ క్యాడర్ ను బలపరచేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. చంద్రబాబు సర్కారుకు ఆదిలోనే కష్టాలు ఎదురయ్యాయని, ప్రజల ఆగ్రహాన్ని ఆయుధంగా చేసుకుని పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మరికొంత మంది మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొని ప్రసంగించారు. చివరగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డిని గజమాలలతో ఘనంగా సత్కరించారు.



**ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్సార్ సిపి పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన భూమన కరుణాకర్ రెడ్డి గారికి శుభాకాంక్షలు తెలిపిన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు. వైయస్సార్ సిపి పార్టీ నాయకులు సైనికులు లాగా పార్టీ కోసం కృషి చేయాలని భూమన కరుణాకర్ రెడ్డి తెలియజేశారు.**



## చిన్నారి కుటుంబానికి బాసటగా ఎన్.డీ. ఏ.సర్కార్..

**సాన్విక తల్లిదండ్రులను పరామర్శించిన హోంమంత్రి అనిత, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు .**

**బాధిత కుటుంబానికి పది లక్షలు చెక్కునందించిన హోంమంత్రి, చిత్తూరు పార్లమెంటు సభ్యులు.**



నగరి: నగరి నియోజకవర్గం,వడమాల పేట మండలం, ఏ.ఎం.పేట ఎస్టీ కాలనీలో అత్యాచారం, హత్యకు గురైన చిన్నారి కుటుంబాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పరామర్శించారు. ముక్కుపచ్చలారని పసికందును పోగొట్టుకుని దిక్కుతోచక దీనావస్థలో ఉన్న సాన్విక తల్లిదండ్రులను ఓదార్చారు. వారికి ప్రభుత్వం తరపున పది లక్షల రూపాయల చెక్కును అందించారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని బరోసా నిచ్చారు. చిన్నారి మరణానికి కారణమైన నిందితుడికి రెండు లేదా మూడు నెలల్లోపు కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

## హోం మంత్రి అనిత కిస్వాగతం పలికిన వినుత కోటా



శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 03,మనం న్యూస్.నగిరి నియోజకవర్గం , వడమాల పేట మండలం లో బాలిక పై అత్యాచారం చేసి ,హత్య చేసిన ఘటన లోబాలిక కుటుంబ సభ్యులను పరామర్శించడానికి ఆదివారం రాష్ట్ర హోం మంత్రి వంగలపుడి అనిత తిరుపతి విమానాశ్రయంకు వచ్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా ఆమెకు స్వాగతం పలికి, మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

## హోం మంత్రిని కలిసిన కొట్టే హేమంత్ రాయల్



తిరుపతి, నవంబర్ 3 మనం న్యూస్ : తిరుపతికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రివర్యులు వంగలపూడి అనిత గారిని పద్మావతి గెస్ట్ హౌస్ నందు టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అదివారం ఆమె తిరుపతికి విచ్చేశారు. ఆమెను కలుసుకుని స్థానిక రాజకీయ అంశాలపై చర్చించారు.



**తిరుపతి రేణిగుంట విమానాశ్రయంలో హోం శాఖ మంత్రివర్యులు శ్రీమతి అనిత గారికి స్వాగతం పలుకుతున్న టిడిపి తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు జి నరసింహ యాదవ్ చిత్తూరు ఎంపీ ప్రసాద్ గారు చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షులు సి ఆర్ రాజన్ గారు తదితరులు**

## సోమవారం మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక...



నవంబర్ 4 వతేది సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఉదయం10 గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నట్లు, ప్రజలు తమ స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఐఏఎస్ గారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపర్చాలని కమిషనర్ తెలిపారు.

## టీటీడీ చైర్మన్ ను కలిసిన పల్లినేని సుబ్రమణ్యం నాయుడు.



చంద్రగిరి, నవంబర్ 3, మనం న్యూస్ : తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ గా నియమితులైన బొల్లి నేని రాజగోపాల్ నాయుడును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆదివారం తెలుగుదేశం పార్టీ చంద్రగిరి మండల అధ్యక్షుడు పల్లి లేని సుబ్రహ్మణ్యం నాయుడు నూతన చైర్మన్ బొల్లి నేని రాజగోపాల్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శావలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శుభగిరి నాయుడు, నాయకులు పాల్గొన్నారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్

తిరుమల,3నవంబర్,మనం ప్రతినిధి:తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెళ్ల మనోహర్. ఆదివారం ఉదయం విఐపి విరామ సమయంలో ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి, దర్శనానంతరం రంగనాయకులు మండపంలో వేద ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు. జనసేన నేత, మాజీ టిటిడి బోర్డు సభ్యులు పసుపులేటి హరిప్రసాద్ తదితరులు మంత్రితోపాటు శ్రీవారి సేవలో పాల్గొన్నారు.

## నవంబరు నెలలో మహనీయుల తిరు నక్షత్రోత్సవాలు

తిరుమల,3నవంబర్,మనం ప్రతినిధి: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి సంవత్సరం పొడవునా అనేక ఉత్సవాలు నిర్వహించడమే కాకుండా, శ్రీవారి పరమ భక్తుల తిరు నక్షత్రోత్సవాలు కూడా టీటీడీ ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తోంది.ఇందులో భాగంగా నవంబరు 3వ తేదీ ఆదివారం నాడు తిరుమల నంబి శాత్తుమొర వైభవంగా జరిగింది. శ్రీ వైష్ణవ భక్తుడైన తిరుమలనంబి తిరుమలలో తీర్థ కైంకర్యాన్ని ప్రారంభించారు. శ్రీవారి ఆలయం దక్షిణ మాడ వీధిలో తిరుమల నంబి ఆలయం కూడా ఉంది.రామానుజాచార్యుల అంశతో జన్మించిన శ్రీ మనవాళ మహాముని శాత్తుమొర నవంబరు 6న జరగనుంది. నవంబరు 9న అత్రి మహర్షి, పిళ్ళైలోకాచార్య,పోయిగై ఆళ్వార్,భూదత్తాళ్వార్ల తిరునక్షత్రోత్సవాలతో పాటు, వేదాంత దేశికాచార్య శాత్తుమొరతో కూడా జరుగనుంది. నవంబరు 10న శ్రీ పేయాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, నవంబరు 11న శ్రీ యాజ్ఞవల్క్య జయంతి జరగనున్నాయి.

## శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,116/-



కాణిపాకం నవంబర్ 3మనం న్యూస్. శ్రీ స్వామివారి నిత్య అన్నదానం ట్రస్ట్ కి విరాళం – 1,00,116/- రూపాయలు దాత – శ్రీ గోపి గారు, వారి కుటుంబ సభ్యులు నగిరి, చిత్తూరు జిల్లా వాస్తవ్యులు, వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసిన సూపర్డెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ విగ్నేష్, తదితరులు ఉన్నారు.

## మున్సిపాలిటీలో సద్గురు యోగి నారాయణ విగ్రహ ప్రతిష్ట. భూమి పూజ కార్యక్రమం జయప్రదం చేయండి



కుప్పం నవంబర్ 3 మనం న్యూస్: కుప్పం మున్సిపాలిటీకి సంబంధించి శ్రీ సద్గురు యోగి నారాయణ బలిజ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కుప్పం పట్టణంలో శ్రీ సద్గురు యోగి నారాయణ కైవారం తాతయ్య గారి విగ్రహం ప్రతిష్టాపన భూమి పూజా కార్యక్రమం 4 వతేది సోమవారం ఉదయం 9 గంటలకు భూమి పూజ కార్యక్రమం జరుగుతుంది కావున నియోజకవర్గంలో ఉన్న బలిజ కుటుంబ సభ్యులు మరియు కైవారం తాత గారి భక్తాదులు, కుప్పం పట్టణం చెరువు కట్ట పైన హాజరుకావాలని ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ , ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం కుప్పం కడ ఆఫీసర్ వికాస్ మరమ్మత్ ,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు , డాక్టర్ బి.ఆర్.డి సురేష్ బాబు , టీటీడీ బోర్డు మెంబర్ శాంతారాం , రాష్ట్ర కార్యదర్శి పి. గోపీనాథ్ , బిజెపి అసెంబ్లీ కన్వీనర్ శివ శంకర్ జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ నరేష్ , టిడిపి మున్సిపల్ అధ్యక్షులు ఎస్ రాజ్ కుమార్ పాల్గొంటారు కావున ప్రతి ఒక్కరూ పాల్గొనాలని భూమి పూజను జయప్రదం చేయాలని సద్గురు యోగి నారాయణ బలిజ సేవా ట్రస్ట్, అధ్యక్షులు ప్రభాకర్ కోరుతున్నారు

## ముక్కంటి సన్నిధిలో కార్తీక దీపోత్సవం



శ్రీకాళహస్తి, నవంబర్ 03,మనం న్యూస్.శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కార్తీక మాసం సందర్భంగా మూడవ రోజు దేవస్థానం ప్రాంగణంలోని ఆకాశ దీప కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు.దేవస్థానం పురోహితులు శాస్త్రోక్తంగా దిపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆకాశ దిపోత్సవ కార్యక్రమం ను తిలకించారు.కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి బాపిరెడ్డి దంపతులు, డిప్యూటీ ఈవో ఎన్.ఆర్ కృష్ణారెడ్డి, ఏఈఓ లోకేష్ రెడ్డి,సూపర్డెంట్ అండ్ సి.ఎస్.ఓ నాగభూషణం యాదవ్,టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి యాదవ్, ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి విరాళాలు సేకరణ



సత్యవేడు, నవంబర్ 03,మనం న్యూస్. సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన మరగదాంబికా సమేత శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం స్థానిక శివ భక్తులు విరాళాల సేకరణ చేపట్టారు. నవంబర్ 21వ తేదీన ఆలయంలో నిర్వహించనున్న ధ్వజస్తంభ ప్రతిష్ట చేయడం కోసం అవసరమైన నిధులను సమీకరించడంలో భాగంగా ఆదివారం మదనంబేడు గ్రామంలోని శివభక్తులు విరాళాల సేకరణకు పూనుకున్నారు.దాదాపు 75 మంది శివభక్తులు శివదుస్తులు ధరించి నిష్టతో గ్రామస్తుల నుంచి విరాళాలను సేకరిస్తున్నారు.

ఇంటింటికి వెళ్లి విరాళాలను సేకరిస్తున్న నేపథ్యంలో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఇంటింటికి వెళ్లిన శివ భక్తుల బృందానికి మహిళలు పెద్ద ఎత్తున హారతులతో స్వాగతం పలకడంతో పాటు తమకు తోచిన సాయాన్ని విరాళాల రూపంలో అందిస్తున్నారు.

# శ్రీ కపిలేశ్వరాలయంలో గణపతి హెూమం





తిరుపతి(టీటీడి),3నవంబర్,మనం ప్రతినిధి: తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఆదివారం గణపతి హెూమం జరిగింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెల రోజుల పాటు హెూమ మహెూత్సవాలు నిర్వహిస్తున్న విషయం విదితమే.

ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో శ్రీ వినాయకస్వామి ప్రతిమకు విశేష అలంకరణ చేపట్టారు. ఉదయం 9 నుండి 12 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో అర్చక బృందం పూజ, జపం, గణపతి హెూమం, లఘుపూర్ణాహుతి, నివేదన నిర్వహించారు. వినాయకుడికి ప్రీతిపాత్రమైన కుడుములు, నెయ్యి, అన్నం, అటుకులు, బెల్లం, అరటిపండ్లు తదితర అష్టద్రవ్యాలతో హెూమం చేపట్టారు. ఇందులో 16 నామాలతో గణపతిని స్తుతించారు. కాగా, సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు జపం, హెూమం, శ్రీ గణపతి సహస్రనామార్చన, నివేదన, విశేష దీపారాధన, మంత్రపుష్పం మరియు హారతి ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్విమ్స్ ఆధ్వర్యంలో చిన్నమాంబట్టులో ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్యం, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం





తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో ఆదివారం తడ మండలం చిన్నమాంబట్టు గ్రామంలో ఉచిత సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరంతోపాటు పింక్ బస్ ద్వారా ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం జరిగింది.

ఈ సందర్భంగా మెడిసిన్, కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, చెవి ముక్కు గొంతు, ఆప్తమాలజీ, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్, గైనకాలజీ, ఎండోక్రైనాలజీ విభాగాలకు చెందిన డాక్టర్లు రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించడంతోపాటు మందులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా బిపి, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు.

ఈ సందర్భంగా స్థానిక నాయకులు వేనాటి జనార్దన్ రెడ్డి, వేనాటి రాజారెడ్డి, వాటంబేటి దుష్యంత్, మోహన్ రావు తదితరులు కలిసి పింక్ బస్సు వద్ద జ్యోతి వెలిగించి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.

పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు.

స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.మునస్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.పద్మావతి, స్థానిక గ్రామ పెద్దలు వేనాటి జనార్దన్ రెడ్డి, రాజారెడ్డి, పాముల పురుషోత్తం, మోహన్ రావు, వాటంబేటి దుష్యంత్, దెయ్యాల నాగరాజు, స్విమ్స్ కు చెందిన వివిధ విభాగాల వైద్యులు, పింక్ బస్సు సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇది నిర్లక్ష్యమా.. ప్రయాణికులకు శాపమ

**ప్రయాణికులకు తీరని ఇక్కట్లు**

**ఆదాయం వస్తున్న పట్టించుకోవడం లేదు**

**స్టాండ్ ఆవరణంలో కనిపించని బోర్డు**

**వి కోట నవంబర్ 3 మనం న్యూస్**





వి కోట మండల కేంద్రంలో గల ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో కొన్ని సంవత్సరాల నుంచి సమస్యలు త్రిష్ట వేసి ఉన్నాయి వాటిని పరిష్కరించే అధికారులు మరియు నాయకులు కరువయ్యాలని వి కోట మండల ప్రజలు మరియు ప్రయాణికులు వాపోతున్నారు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వాణిజ్య సముదాయం లో గల దుకాణాల ద్వారా బాడుగ రూపంలో దాదాపు సంవత్సరానికి కొన్ని లక్షల రూపాయలు ఆర్టీసీ కి వస్తూఉంది కానీ అభివృద్ధి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

**ఆర్టీసీ బస్టాండ్ అని గుర్తించడం ఎలా..?**

దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులకు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఎలాంటి బోర్డు లు లేకపోవడం తో ఎక్కడ ఏ బస్టాండ్ లో ఉన్నామని ప్రయాణికులు తెలుసుకోవడానికి కరాడా చాలా ఇబ్బంది పడుతున్నారు ఇంకా రాత్రి సమయాలలో బస్టాండ్ అవనంలో దీపాలు లేకపోవడం వల్ల బస్సులు కూడా లోపలికి రాకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడాల్సి వస్తుంది

**కనీస సౌకర్యాలు కరువు**

వి కోట లోని ఆర్టీసీ బస్టాండ్ రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది.. బస్టాండ్లో ప్లాట్ఫారాలు ఉన్నా ప్రయాణికులు కూర్చోవడానికి అను కూలంగా లేవు.. ఏళ్ల తరబడిగా సరైన మం చి నీటి సౌకర్యం లేదు.. అపశుభ్రంగా మరుగుదొడ్లు . దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నా రు. ప్రయాణికుల వినోదం కోసం ఏర్పాటు చేసిన ఒక్క టీవీ కూడా పని చేయడం లేదు. సరిపడా కుర్చీలు కూడా లేకపోవడంతో బస్సులు వచ్చేంత వరకు ప్ర యాణికులు గంటల తరబడి నిలబడే ఉంటున్నారు.

**చినుకు పడితే చిత్తడే**

వర్షాలు పడితే ఇక్కడి పరిస్థితి మరీ దారుణంగా తయారవుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. బస్టాండ్ లోపలికి బస్ రావాలన్నా... పోవాలన్న ప్రయాణికులకు, డ్రైవర్లకు కత్తి మీద సాముగా మారింది. కొన్ని ఏళ్ళ క్రితం చేసిన పనులే తప్ప... ఇప్పటికీ ఎలాంటి సౌకర్యాలు లేవని ప్రయాణికులు అంటున్నారు

**బస్టాండ్ ఆవరణం లో దుర్వాసన**

ఇక బస్టాండ్ ఆవరణ గురించి చెప్పాలంటే మరీ అధ్వానంగా మారుతోంది. బస్టాండ్లో మురినీరు ప్రతినిత్యం పారుతూనే ఉంది.. ఈ సమస్యకు ఏళ్ల తరబడిగా పరిష్కారం చూపడం లేదు. బస్టాండ్ ముందు భాగంలో ఆవరణలో ప్రమాదకర గుంతలు తయారయ్యాయి. కనీసం మరమ్మతులు చేయక అది కారులు చేతులేత్తేశారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక చెత్త, మురుగునీరు వాసనతో మురికి కూపంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మురికి నీరు నిలువ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోం దన్నారు. బస్ వెనుక మరో బస్ వస్తే... పెద్ద ఎత్తున లేచే దుమ్ముతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆర్టీసీ డ్రైవర్లు వాపోతున్నారు. గుంతలమయంగా మారిన బస్టాండ్లోకి రావడమమంటే ప్రయాణికుల ప్రాణాలతో ఆటలాడు కోవడమే నని వాపోతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా బస్టాండ్ ఇలాగే ఉందని ఇప్పటికైనా ఉన్నత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రయాణికులకు కావలసిన సౌకర్యాలు. మరియు వి కోట ఆర్టీసీ బస్టాండ్ ను అభివృద్ధి చేయవలసిందిగా మండల ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

# రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, సీ.ఎం. రమేష్ కి స్వాగతం పలికిన కోలా ఆనంద్



శ్రీకాళహస్తి, నవంబర్ 03,మనం న్యూస్.రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, అనకాపల్లి ఎంపీ సీ.ఎం. రమేష్, జాతీయ ఓబీసీ చైర్మన్ లక్ష్మణ్ లకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ స్వాగతం పలికారు. వారికి శివుని

శేషవస్త్రం, గజమాలతో సన్మానించి స్వాగతం పలికారు.ఆదివారం ప్రత్యేక రైలులో పార్లమెంటరీ కమిటీతో కలసి రేణిగుంట రైల్వేస్టేషన్ కు చేరుకున్న పార్లమెంటు కమిటీ ఛైర్మన్, కమిటీ సభ్యులకు ఘనంగా స్వాగతం పలికి అందరినీ శేష వస్త్రం లతో సన్మానం చేశారు. శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి, రేణిగుంట, ఏర్పేడు, రాచగున్నేరి, మామండూరు రైల్వే స్టేషన్లో మౌలిక సదుపాయాలు, ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం,భద్రత కల్పించడం కోసం వారితో కోలా ఆనంద్ చర్చించారు. అందుకు స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, సభ్యులు సానుకూలంగా స్పందించారని కోలా ఆనంద్ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ కో – కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, టి డి పి నాయకులు చంద్రయ్య నాయుడు, చెంచయ్య నాయుడు, మిన్నల రవి, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటి గోపాల్, కునాటి నాగరాజు, శ్యామ్ చండ్ గెహ్లాట్, టిడిపి బి. చంద్రా రెడ్డి, రాజా రాయల్, భరత్ కుమార్ నాయుడు, సజ్జలు హరీష్, తదితులు పాల్గొన్నారు.

## సైబర్ మోసం, రూ. 9,36,126 మోస పోయిన బాధిత మహిళ.

తిరుపతి రూరల్ మండలం పుడిపట్ల నివసిస్తున్న ఇందు మతి అనే మహిళా %ంజ% వెటర్నటి కాలేజ్ లో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నది. ఆమె ఇన్స్టాగ్రామ్ లో రీల్స్ చూసేటప్పుడు వచ్చినా వీడియో లో పార్ట్ టైం జాబ్ లో డబ్బులు ఎలా సంపాదించవచ్చు అని కావాలి అనుకునేవారు వారు చెప్పిన వాట్సాప్ లో %ష్ముఱ% అని మెసేజ్ పెట్టినారు అని అందులో వారు పంపిన లింక్ లు క్లిక్ చేయడం తో ఆమె కు కొన్ని అప్ లు వచ్చినాయి అని తదుపరి టెలిగ్రామ్ అప్ వచ్చింది అని అందులో ఉండిన డీటెయిల్స్ అప్లోడ్ చేసి వారు పంపిన బ్యాంకు అకౌంట్ కు డబ్బులు పంపి అప్ లో ఉండే బంగారం కొనుకోలు కోసం డబ్బులు పంపడం జరిగింది అని తదుపరి వారు పంపిన లింక్ లోని అప్ పనిచేయక పోవడం తో మోస పోయానని తెలుసుకొని %ూా% కు వచ్చి పిర్యాదు ఇచ్చినది. ఆమె ఇచ్చిన పిర్యాదు మేరకు సైబర్ కేసు గా నమోదు చేయడం జరిగింది.

## రేపు టెట్ ఫలితాలు విడుదల చేయనున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

అమరావతి ఫాస్ట్ న్యూస్ అక్టోబరు 3 నుంచి 21 వరకు టెట్ నిర్వహించిన ఏపీ సర్కారు3.68 లక్షల మంది హాజరు రేపు ఫలితాల విడుదలకు అన్ని ఏర్పాట్లు పూర్తిఏపీలో టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) ఫలితాల విడుదలకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రేపు (నవంబరు 4) టెట్ ఫలితాలను విడుదల చేయనున్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించేందుకు కసరత్తులు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే టెట్ ఫలితాలు విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో గత నెల 3వ తేదీ నుంచి 21 వరకు ఆన్ లైన్ విధానంలో టెట్ నిర్వహించగా... 3.68 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారు. టెట్ ఫలితాల విడుదల వాస్తవానికి నవంబరు 2నే జరగాల్సి ఉండగా... నవంబరు 4కి వాయిదా వేశారు. మంత్రి నారా లోకేశ్ కూడా అమెరికా పర్యటన ముగించుకుని రావడంతో, రేపు ఆయన చేతుల మీదుగానే ఫలితాలు విడుదల చేయనున్నారు.



## ఉమ్మడి జిల్లాల వైయస్సార్సీపి నూతన అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి ని కలసిన ఎంబి కుమార్ రాజా.

బంగారుపాళ్యం నవంబర్ 3. మనం న్యూస్: చిత్తూరు తిరుపతి ఉమ్మడి జిల్లాల వైయస్సార్సీపి నూతన అధ్యక్షులుగా ఎన్నికైన భూమన కరుణాకర్ రెడ్డిని తిరుపతి నందు ప్రమాణోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పాలయకరి అధ్యక్షులు బంగారుపాళ్యం ఎం బి కుమార్ రాజా ఆదివారం తన అనుచరులతో కలసి శాలువా కప్పి బొకే అందించి కరుణాకర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పూతలపట్టు మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్, బంగారుపాళ్యం మండల వైఎస్ఆర్సిపి నాయకులు కలసి శుభాభినందనలు తెలియజేశారు. నూతన ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు భూమన్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే 2029వ సంవత్సర ఎలక్షన్లలో ప్రతి ఒక్క నాయకులు కార్యకర్తలు పనిచేసి వైయస్సార్సీపి పార్టీని మరింత బలోపేతం చేసి, రెండవసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవడమే మనందరి ధ్యేయంగా పనిచేయాలని కరుణాకర్ రెడ్డి హితవు పలికారు

## జాకీ షోరూమ్ ను ప్రారంభించిన భాను ప్రకాష్ రెడ్డి




తిరుపతి టౌన్,3నవంబర్,మనం ప్రతినిధి: ప్రముఖ లోదుస్తుల కంపెనీ జాకీ షోరూమ్ ను ప్రారంభించిన బిజెపి నేత, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి. ఆదివారం తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్ లో జాకీ షోరూమ్ కు ముఖ్యఅతిథిగా విచ్చేసి షోరూం ను ప్రారంభించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ షోరూమ్లను తిరుపతికి పరిచయం చేస్తున్న ప్రభాకర్, ఓం లను కొనియాడారు.విరి వ్యాపారం మరింత అభివృద్ధిలోకి రావాలని ఆ దేవదేవుని కోరుకుంటున్నట్టు భాను ప్రకాష్ రెడ్డి తెలియజేశారు.

## పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి కృషి చేద్దాం



వి కోట నవంబర్ 3 మనం న్యూస్: వి.కోట మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 6 వ తేదిన నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ యువరాజు పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటు అయిన ప్రభుత్వంలో తొలిసారిగా సమావేశం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ, మండల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా మండల కార్యవర్గంతో పాటు ప్రజాప్రతిధులు అందరూ సంపూర్ణ సహకారాలు ప్రస్తుత ప్రభుత్వానికి అందించేందుకు ఎల్లవేళల సంసిద్ధంగా ఉన్నామన్నారు. మండల అభివృద్ధి విషయంలో ఆరోపణ, ప్రత్యారోపణలతో కొంత గందరగోళ పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి అన్నారు పుంగనూరు అల్లర్ల కేసులతో తన కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ విషయాలు జరగడం దురదృష్టకరం.వ్యక్తిగతంగా ఎవరిపైనా ఎలాంటి ద్వేషాలు లేవు, పార్టీల పరంగా జరిగిన ఆరోపణలు, సవాళ్లు ఇక పూర్తిగా వదిలిపెట్టి సోదరభావంతో ఉండి అన్ని పార్టీల వారు కలిసి మెలిసి మండల అభివృద్ధికి కృషిచేయాలన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన.

**డాలర్స్ దివాకర్ రెడ్డి.**



చంద్రగిరి, నవంబర్ 3, మనం న్యూస్ : తెలుగుదేశం పార్టీ నాయకుడు తుమ్మలగుంట గ్రామానికి చెందిన దొడ్ల కరుణాకర్ వారి వివాహానికి హాజరై. ఆదివారం చంద్రగిరి స్థానిక యంఎస్ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన వివాహానికి దొడ్ల కరుణాకర్ రెడ్డి వారి ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## 28 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**చదువులు నేర్పిన గురువులకు సన్మానం**




తిరుపతి,03 నవంబర్, మనం న్యూస్: తిరుపతిలోని టీపీపీఎం హైస్కూల్లో 1995-96 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సమ్మేళనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారంతా 28 సంవత్సరాల తర్వాత తాము చదివిన స్కూల్ వద్దకు చేరుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పదవ తరగతిలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన మునిరామయ్య (మ్యాథ్స్), వెంకటేశ్వర్లు (ఇంగ్లీష్), పర్వత రెడ్డి (సోషియల్), ఉపాధ్యాయుని శ్రీదేవి ప్రస్తుత టీపీపీఎం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆనంద లను శాలువాలు కప్పి సన్మానించి తమ ఆత్మీయ గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అందరూ కలిసి భోజనం చేసిన తర్వాత వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమతో పాటు పదవ తరగతి చదివి ఆకస్మికంగా తుది శ్వాస విడిచిన మిత్రులను తలచుకొని ఆవేదన చెందారు. వారి ఆత్మకు శాంతి కలగాలంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. తాము విద్యా బుద్ధులు నేర్పిన ఆనాటి పిల్లలు నేడు వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నత స్థానాల్లో ఉండటం చూసి ఉపాధ్యాయులు ఆనందించారు.

## శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈవోగా బాధ్యతలు స్వీకరించిన టి.బాపిరెడ్డి



శ్రీకాళహస్తి, నవంబర్ 03,మనం న్యూస్. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం నూతన ఈవోగా టి.బాపిరెడ్డి ఆదివారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు.ముందుగా ఈ ఓ బాపిరెడ్డి కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి విచ్చేశారు.వారికి డిప్యూటీఈవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి స్వాగతం పలికి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించారు.

అనంతరం శ్రీ మేధాగురుదక్షిణామూర్తి సన్నిధానం వద్ద శేష వస్త్రంతో సత్కరించి శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి తీర్థప్రసాదాలను చిత్రపటాన్ని అందజేశారు.అనంతరం పరిపాలన భవనంలో ఆయన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## టి టి డి బోర్డుమెంబర్ను సన్మానించిన కార్యక్రమంలో

**రాష్ట్ర కార్యదర్శి మరియు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్**





కుప్పం నవంబరు 3 మనం న్యూస్:

కుప్పం మున్సిపాలిటీ కి సంబంధించి. టిటి డి బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం ను రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్ మరియు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సతేంద్ర శేఖర్ టిటిడి బోర్డు మెంబర్ ను సన్మానించారు ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, కౌన్సిలర్ సోము, చెక్కునత్తం మణి, బాలు ,తదితరులు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## గట్టూరు ఎస్సీ కాలనీలో మురుగు నీటితో నిండిన దారి



శాంతిపురం మండలం నవంబర్ 03 మనం న్యూస్ : మండలం పరిధిలోని శివరామపురం గ్రామ పంచాయితీ గట్టూరు గ్రామం,ఎస్సీ కాలనీలో డ్రైనేజీలను ఏర్పాటు చేయండి మహాప్రభో అంటూ కాలనీ వాసులు వేడుకుంటున్నారు.స్థానికుల వివరాల మేరకు

మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడం వలన చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమల వలన దళిత ప్రజలు అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలవుతున్నారు.రెండు నెలల క్రితం నిర్వహించిన సంపూర్ణ పారిశుధ్యం కార్యక్రమంలో కూడా ఈ సమస్యను పరిష్కరించ లేక పోయారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్సీ కాలనీలో ఉన్నటువంటి సమస్యను పరిష్కారం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం పట్టివేత



శాంతిపురం,నవంబర్ 3 మనం న్యూస్: శాంతిపురం మండలం 64 పెద్దూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కుప్పం కేజీఎఫ్ రహదారి గెసికపల్లి గ్రామ సమీపంలో కుప్పం డీఎస్పీ పార్థసారథి,ఉత్తర్వుల మేరకు కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ సూచనలపై రాళ్ళబుదుగురు ఎస్సై ఐ.నరేష్ సిబ్బందితో కలిసి ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులు కర్ణాటక మద్యాన్ని అక్రమంగా కర్ణాటక నుండి కుప్పం వైపు తీసుకొస్తుండగా,సదరు కర్ణాటక మద్యాన్ని మరియు మద్యాన్ని తరలించడానికి ఉపయోగించిన రెండు మోటార్ సైకిల్స్ ను స్వాధీనం చేసుకున్నారు.సదరు మొత్తం కర్ణాటక మద్యం ప్యాకెట్లు-3024, 285.120 లీటర్ల మద్యం విలువ %=o%.1,23,360/- ఉంటుందన్నారు. మద్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

## క్రాస్ వీల్ లో ఇద్దరు మహిళలు కూర్చొని తిరుగుతుండగా ఒక్కసారిగా కుప్పకూలడం





తిరుచానూరు శిల్పారామంలో ఆదివారం సాయంత్రం విషాదకర సంఘటన చోటుచేసుకుంది. క్రాస్ వీల్ లో ఇద్దరు మహిళలు కూర్చొని తిరుగుతుండగా ఒక్కసారిగా కుప్పకూలడంతో ఓ మహిళ మృతి అక్కడిక్కడే మృతి చెందింది. మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఆ మహిళ పరిస్థితి విషమంగా ఉండడంతో రుయా ఆసుపత్రికి తరలింపు తరలించారు.ఘటనా స్థలానికి చేరుకున్న తిరుచానూరు పోలీసులు విచారణ సేకరిస్తున్నారు

## ప్రభుత్వ పాఠశాలల్లో పేద ఆయాలపై చోటా కూటమి నాయకుల కర్ర పెత్తనం..!?

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయాలని గ్రామ ప్రజలు హితవు పలుకుతున్నారు.

**అకారణంగా ఆయాను తొలగించే విషయమై విచారణ చేపడతాం... మండల విద్యాశాఖ అధికారి మునిరత్నం**

నాయుడుపేట మండలం అయ్యప్పరెడ్డిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయాను అకారణంగా తొలగించే విషయమై విచారణ చేపడతామని మండల విద్యాశాఖ అధికారి మునిరత్నం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఆయాలను అకారణంగా ఏ ఒక్కరిని తొలగించమని ఆయన తెలిపారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆయన తొలగించే విషయమై ప్రధానోపాధ్యాయులను విచారిస్తామని ఆయన పేర్కొన్నారు.



**ఆంధ్ర గోల్డ్ ఫైన్ విస్కీ బాటిల్లు అమ్మడానికి ప్రయత్నిస్తుండగా**

## అతనిని పట్టుకున్న బంగారుపాలెం పోలీసులు.

బంగారుపాలెం నవంబర్ 3. మనం న్యూస్: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో ఆదివారం ఉదయం 6:30 గంటలకు బంగారుపాలెం మండలం లక్ష్మీపురం రోడ్డు రాగిమాను పెంట బస్టాప్ వద్ద కే ఢిల్లీ ప్రసాద్ వయస్సు 35 సంవత్సరములు (తండ్రి) కె. బాలకృష్ణ రాగి మాను పెంట గ్రామం అతను ఆంధ్ర గోల్డ్ ఫైన్ విస్కీ 47 క్వాటర్ బాటిల్ పెట్టుకుని ఉంటే బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎన్. బాబు వారి సిబ్బంది అతనిని అరెస్టు చేయడమైనది. తదుపరి అతనిని బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి సిఐ కే. శ్రీనివాసులు అతనిని అరెస్టు చేసి కేసు నమోదు చేయడమైనది. కార్యక్రమంలో ఏఎస్ఐ వల్లెమ్మ, హెడ్ కానిస్టేబుల్ బాబు, కానిస్టేబుల్స్ సుధా నీరజాక్షులు మోహన్ నాయుడు ఉమాశంకర్ హెూంగార్డ్స్ కోదండ చంద్ర తదితరులు పాల్గొన్నారు

## పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన సీఐ రమేష్




రామసముద్రం, నవంబర్ 3 మనం న్యూస్: రామసముద్రం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను ఆదివారం సీఐ కె రమేష్ తనిఖీ చేశారు .ఇందులో భాగంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి పలు కేసుల వివరాలు అడిగి తెలుసు కున్నారు. సీఐ రమేష్ మాట్లాడుతూ అసాంఘిక కార్యాక్రమాలకు పాల్పడినా,రౌడీయిజం ప్రోత్సహించిన ఉపేక్సించేది లేదని సీఐ హెచ్చరించారు. మండల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు,పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్నారని అన్నారు.అసాంఘిక కార్యకలాపాలతో జనజీవానికి ఆటంకాలు కలిగిస్తే,పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలం లోని కర్ణాటక సరిహద్దులోని చెక్ పోస్ట్ వద్ద ప్రత్యేక పోలీస్ లను పెట్టామని సీఐ తెలిపారు. అక్రమ మద్యం, జూదం పై నిఘా ఉంచామన్నారు.కొత్త వ్యక్తుల రాకపోకలపై ప్రత్యేక ద్రుష్టి పెట్టామని . ఎలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత పోలీస్ లపై ఉందన్నారు. ఈతనిఖీల్లో సీఐ కె రమేష్ తో పాటు ఎస్సై వెంకటసుబ్బయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.ఎస్సై వెంకటసుబ్బయ్య,సీఐ రమేష్ కు వివరణ తెలియజేశారు.ప్రతిరోజు మా సిబ్బంది తో కలిసి కర్ణాటక భార్డర్ లో తనిఖీ నిర్వహించడం,పలు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలతో మమేకమై గ్రామ ప్రజలు ఎలాంటి గొడవలు పెట్టుకోరాదని వారికి సలహాలు ఇస్తున్నామని సీఐ కి తెలిపారు.

## 1000లీటర్ల నాటు సారా ఊట ధ్వంసం



గుడిపాల నవంబర్ 3 మనం న్యూస్ మండలంలోని రాసనపల్లి అటవీ ప్రాంతంలో గుడిపాల ఎస్సై రామ్మోహన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో సారాయి కాచడానికి సిద్ధపరచిన 1000 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ వెల్లడించారు మండల పరిధిలో సారా తయారీ గంజాయి విక్రయాలు ఇతర శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు గుడిపాల మండలాన్ని సారా రహిత మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## గ్రామాల్లో రికార్డులు లేని వాహనాల తనిఖీ




బుచ్చినాయుడు కండ్రిగ, నవంబర్, 0 3,మనం న్యూస్.మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వాహనాలను ఎస్ ఐ విశ్వనాధం నాయుడు తమ సిబ్బంది తో కలసి తనిఖీ చేశారు.మండలం లోని తలారి వెట్టు పంచాయతీ, ఎన్టీఆర్ నగర్, కాంపాళ్యం గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున స్థానిక ఎస్సై విశ్వనాథ నాయుడు, తన సిబ్బందితో కలిసి ఐదు గంటల నుండి గ్రామంలోని ప్రతి ఇంట్లోని రికార్డు లేని వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దొంగ వాహనాలు ఎక్కువ అవ్వడం, ఆర్ సి లేకపోవడం వాహనాలు చోరీకి గురికావడం వలన దొంగతనాలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలోతనిఖీలు చేపట్టామన్నారు.సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.సరైన పత్రాలు చూపించి తమ వాహనాలను తీసుకోవాల్సిందిగా స్వాధీనం చేసుకున్న వాహనాల యజమానులకు తెలియజేశారు. తెల్లవారుజామునైతే ప్రతి వాహనము వివరాలు తెలుసుకోవచ్చని ఎస్సై విశ్వనాథ నాయుడు తెలిపారు.

## కేఎం కండిగ పంచాయతీలో పంట పొలాలపై గజరాజులు దాడి.

**దాదాపు లక్ష రూపాయల నష్టం .. లబోది మున్న రైతన్న**

. బంగారుపాళ్యం నవంబర్ 3 మనం న్యూస్. పూతలపట్టు నియోజకవర్గం కేఎం కండిగ గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం రాత్రి. 11 గంటల ప్రాంతంలో ఒంటరి ఏనుగు ఆ గ్రామానికి చెందిన ఢిల్లీ బాబు. మామిడి చెట్లు. ధ్వంసం చేయనట్లు రైతు ఢిల్లీ బాబు.మీడియా సమావేశంలో తెలిపారు పొట్టకూటి కోసం మామిడి చెట్టును. జామ చెట్టు నాటి జీవనగడుపుకున్నాడు. శనివారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలను నాశనం చేసి దాదాపు 1. లక్ష రూపాయలు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై స్థానిక వీఆర్ఓకు ఢిల్లీ బాబు ద్వారా వినతి పత్రం ద్వారా అందజేశారు. ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం చేయాలని ఢిల్లీ బాబు తెలిపారు.

## నాదేండ్ల మనోహర్ కి వీడ్కోలు పలికిన అంజూరు చక్రధర్



శ్రీకాళహస్తి, నవంబర్ 03,మనం న్యూస్.రెండు రోజుల తిరుపతి పర్యటన ముగించుకొని, కలియుగ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని తిరిగి హైదరాబాద్ కి ప్రయాణం అవుతున్నరాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జనసేనపార్టీ పి ఏ సి చైర్మన్ నాదెండ్ల మనోహర్ కి రేణిగుంట విమానాశ్రయం వద్ద జనసేనపార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ మర్యాదపూర్వకంగా కలిసి వీడ్కోలు పలకారు.



## జిల్లా టిడిపి కార్యాలయంలో కూటమి పార్టీల నాయకుల సమావేశం

నెల్లూరు, మనం న్యూస్: నెల్లూరు నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీల నాయకుల సమావేశం జరిగింది. సాగునీటి సంఘాల ఎన్నికలు, కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, నియోజకవర్గాల వారీగా కూటమి నాయకుల మధ్య సమన్వయం, జిల్లా అభివృద్ధి కొరకు చేపట్టవలసిన కార్యక్రమాలు, దేవాలయ పాలకమండళ్ళు, ఏఎంసీ కమిటీలు, ఇతర నామినేటెడ్ పదవుల భర్తీ, అధ్యక్షులు వారి అనుమతి తో ఇతర అంశాలు అజెండాగా సమావేశం సాగింది.

జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర పట్టణాభివృద్ధి పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ, పోలిట్ బ్యూరో సభ్యులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, కావలి శాసనసభ్యులు దగ్గు మాటి వెంకటకృష్ణారెడ్డి, కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి, జనసేన పార్టీ నాయకులు వేములపాటి అజయ్ కుమార్, నూనె మల్లికార్జున యాదవ్, బిజెపి జిల్లా అధ్యక్షులు వంశీధర్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి



నెల్లూరు, మనం న్యూస్: నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా సమీక్ష మండలి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఇన్చార్జి మంత్రి,జిల్లా మంత్రులు,ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలోని జాఫర్ సాహెబ్ కెనాల్, సర్వేపల్లి కెనాల్ వద్ద పనులు అసంపూర్తిగా జరగడంతో పాటు .. రివీట్ మెంట్ గోడ ఎత్తు తక్కువ గా ఉండడం వలన పిల్లలు, పెద్దలు అందులో పడి ఎంతోమంది ప్రమాదాలు బారిన పడుతున్నారని.. రివీట్ మెంట్ వాల్ వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు . అలాగే రామలింగాపురం ఫ్లైఓవర్ జంక్షన్ కింద.. ట్రాఫిక్ ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని .. ఆ ప్రాంతంలో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని, గ్రీనరీ ని అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే చింతా రెడ్డిపాలెం జాతీయ రహదారి మీద .. ఫ్లైఓవర్ ను ఏర్పాటు చేసి..ప్రమాదాలను నివారించి ఆ ప్రాంతవాసులకు ఇబ్బంది తలెత్తకుండా.. ప్రమాదాలను అరికట్టాలని కోరారు. ఈసందర్భంగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వివరణ ఇచ్చారు.

## డీఆర్సీలో పాల్గొన్న విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి

నెల్లూరు, మనం న్యూస్: నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం



జరిగిన డీఆర్సీ మీటింగ్ లో నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. డీఆర్సీ సమావేశానికి జిల్లా ఇన్చార్జి మంత్రి ఎంఎన్డీ ఫారుక్ , మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ , జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడిని ఆదుకున్న విపిఆర్ ఫౌండేషన్



నెల్లూరు, మనం న్యూస్: ఉదయగిరి మండలం సంజీవరావు పల్లి గంగులవారి చెరువు గ్రామానికి చెందిన బడబాగ్ని కేశవరాజు యాక్సిడెంట్ లో ఓ కాలు కోల్పోయాడు. ఊత కర్రల సహాయంతో నడిచే కేశవరాజు కాలు తీసి కాలు వేయడమే కష్టంగా ఉండేది. అంగవైకల్యంతో నడవలేని నిస్సహాయులకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలోని విపిఆర్ ఫౌండేషన్ ద్వారా బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్స్ ఇస్తున్నారని తెలుసుకున్నాడు. నెల్లూరు నగరంలోని మాగుంట లే అవుట్ లోని విపిఆర్ నివాసానికి చేరుకున్న కేశవరాజు వేమిరెడ్డి దంపతులకు తన దీన స్థితిని వివరించాడు. వెంటనే స్పందించిన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బడబాగ్ని కేశవరాజుకు ఎలక్ట్రానిక్ ట్రై సైకిల్ ను ఆదివారం అందచేశారు. నడవలేని నిస్సహాయ స్థితిలో వున్న తనకు ట్రైసైకిల్ అందచేసిన వేమిరెడ్డి దంపతులకు కేశవరాజు కృతజ్ఞతలు తెలియ చేసాడు.

## ఇన్చార్జి మంత్రి ఫరూక్ ని కలిసిన సోమిరెడ్డి, అజీజ్



నెల్లూరు, మనం న్యూస్ నెల్లూరు పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇన్ చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ లో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ లు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్ చార్జి మంత్రిగా నియమితులైన తర్వాత మొదటి సారిగా నెల్లూరుకు విచ్చేసిన ఫరూక్ కు ఆత్మీయ స్వాగతం పలకడంతో పాటు శుభాకాంక్షలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

## ఈవోగాబాధ్యతలు చేపట్టిన గిరి కృష్ణ



నెల్లూరు, మనం న్యూస్ : నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా గిరి కృష్ణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, శ్రీ వేదగిరి నరసింహస్వామి దేవస్థానం, జొన్నవాడ దేవస్థానం ఈవోగా పనిచేసి వున్నారు. బదిలీల్లో భాగంగా గిరి కృష్ణను శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఈవో గా నియమించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, ఫెస్టివల్ కమిటీ చైర్మన్ ఓట్టూరు సురేంద్ర యాదవ్ ఆయన కలిసి అభినందనలు తెలిపారు.

# తల్లిదండ్రులు బిడ్డలకు ఇచ్చే ఏకైక ఆస్తి చదువే

**మంత్రి నారాయణ**



నెల్లూరు,మనం న్యూస్, (కార్పోరేషన్): ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఇచ్చే ఏకైక ఆస్తి చదువేనని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు.

ఆదివారం నగరంలోని కాపు భవన్లో ఉత్తమ మార్కులు సాధించిన బలిజ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించే కార్యక్రమంలో మంత్రి నారాయణ పాల్గొన్నారు. తోలుత విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ విజయ భాస్కర్, ఇతరులు వెంట రాగా జ్యోతి ప్రజ్వలన చేసి సభను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి నారాయణను బలిజ సంఘం నేతలు గజమాల, దుశ్యాలువతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారాయణ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువే ఏకైక మార్గమని, చదువే పిల్లలకు ఇచ్చే ఆస్తియని అన్నారు. విద్య నాగరికత నేర్పిస్తుందన్నారు. అదేవిధంగా గతంలో తాను మంత్రిగా పనిచేసిన కాలంలో కాపు భవన్ నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా స్థలం మంజూరు చేయించి నిర్మాణానికి కృషి చేశామన్నారు. దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత ఓ మంచి కార్యక్రమం ద్వారా ఈ భవనం లో అడుగు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 104 మంది విద్యార్థినీ విద్యార్థులకు 4 లక్షల 20 వేల ఆర్థిక సహాయం అందించడం గొప్ప విషయమన్నారు. ఇందుకు సహకరించిన డాక్టర్ పోకల రవి ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామన్నారు. ఇటువంటి ప్రోత్సాహకాలు అందించడం ద్వారా చదువుకునే విద్యార్థినీ విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి గారితో ఎన్నో ఏళ్లుగా పరిచయం ఉన్నప్పటికీ, విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలని చంద్రబాబు ఆహ్వానించడంతో 2014 సంవత్సరంలో రాజకీయాల్లోకి అడుగు పెట్టడం జరిగిందన్నారు. అదే క్రమంలో నూతన రాష్ట్ర రాజధాని నిర్మాణ బాధ్యతలను కూడా అప్పగించారన్నారు. నెల్లూరు ప్రజలు అందించిన సహకారంతో చరిత్రలో నిలిచిపోయేవిధంగా రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గనుకుల కిషోర్, అళహరి సుధాకర్, బలిజ సామాజిక వర్గ నాయకులు అనిల్ కుమార్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ పార్కును ప్రజలకు అంకితం చేసిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



నెల్లూరు, మనం న్యూస్, (కార్పోరేషన్): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్, అన్నమయ్య సర్కిల్, మాగుంట లేఔట్ నందు 2 కోట్ల రూపాయల వ్యయంతో నందమూరి తారకరామారావు పార్కు ను ప్రజలకు నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, అంకితం చేశారు. ఈసందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ

నందమూరి తారకరామారావు పార్కు అభివృద్ధి కావాలని స్థానిక ప్రజల చిరకాల కల ఈరోజు నెరవేరిందని అన్నా రు. ఈ పార్కును ప్రజలకు అంకితం చేయడం చాలా సంతోషంగా ఉందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు.

గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఆనాటి మంత్రి పొంగూరు నారాయణ , నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి , నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ప్రత్యేక చొరవతీసుకుని దాదాపు ఈ పార్కు పనులను పూర్తిచేశారని,కానీ గత వైసీపీ ప్రభుత్వంలో ఈ పార్కు ప్రారంభానికి నోచుకోలేదని, అనేకసార్లు నేను స్థానిక శాసనసభ్యుడిగా అనేక ప్రయత్నాలు చేసినా వీలుకాని పరిస్థితి అని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈనాడు దేవుడి దయ, ప్రజలందరి అశీస్సులతో, నాయకుల, కార్యకర్తల కష్టంతో తెలుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిందని రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు , మంత్రిగా పొంగూరు నారాయణ సహాయసహకారాలతో నేడు ఎన్.టి.ఆర్. పార్కుని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఇంకాకుడా ఈ పార్కుని అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని ఈ పార్కు అభివృద్ధికి స్థానిక శాసనసభ్యుడిగా బాధ్యత తీసుకుంటాను అని, నెల్లూరు నగరంలోనే విశాలమైన పార్కు, వాకింగ్ ట్రాక్, క్రీడా పరికరాలు, షటిల్ , టెన్నీస్ కోర్ట్ , అన్నివిధాలుగా స్థానిక ప్రజలకు ఈ పార్కు ఉపయోగపడుతుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నెల్లూరు నగరంలో ఏ పార్కు చూసినా, ఏ అభివృద్ధి కార్యక్రమాలు చూసినా గుర్తొచ్చేది మంత్రి పొంగూరు నారాయణ అని ఆనాటి కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్య నాయుడు సహాయసహకారాలతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో నగరంలో భూగర్భ డ్రైనేజ్, ప్రతి ఇంటికి మంచి నీటి పథకం పనులు చేసారు అనిరూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలపక్షాన మంత్రి పొంగూరు నారాయణ కి, మాజీ నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కి, మాజీ నగర మేయర్ అబ్దుల్ అజీజ్ కి, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ కి, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ , నుడా అధికారులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పై కార్యక్రమంలో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, కార్పొరేటర్ మారం రెడ్డి జ్యోతి ప్రియా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, క్లస్టర్ ఇంచార్జీ నెల్లూరు మురళి, 19వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి నూకరాజు మదన్ కుమార్ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కనిగిరి రిజర్వాయర్ ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తా

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



నెల్లూరు, మనం న్యూస్: కోవూరు నియోజకవర్గ పరిధిలో రైతాంగ ప్రయోజనాల కోసం పాటుపడతానన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కనిగిరి రిజర్వాయర్ క్రస్ట్ గేట్లు ఎత్తి నీటి విడుదల కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కి బుచ్చిరెడ్డి పాళెం మండల నాయకులు రైతులు ఘన స్వాగతం పలికారు. బుచ్చి, కోవూరు, విడవలూరు, కొడవలూరు మండలాల రైతుల విజ్ఞప్తి మేరకు నారు మళ్ల అవసరాల కోసం ఆమె సదరన్ ఛానల్ ద్వారా 100 ఈస్టర్న్ ఛానల్ ద్వారా 80 క్యూసెక్కుల నీళ్లు విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కనిగిరి రిజర్వాయర్ లో గత కొన్నేళ్లుగా పూడిక తీయని కారణంగా పూర్తి సామర్థ్యం మేరకు నీళ్లు నిల్వ చేయలేకపోతున్నట్లు రైతు సంఘ నాయకులు తన దృష్టికి తెచ్చారన్నారు.

పూడిక తీయడమా.. ఎత్తు పెంచి కరకట్ట పటిష్టంగా ఉండేలా రివీట్ చేయించడమా అన్న విషయం పై సీనియర్ ఇరిగేషన్ ఇంజినీర్ల సలహా తీసుకొని ముఖ్యమంత్రి దృష్టి తీసుకెళ్లి రిజర్వాయర్ పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం కనిగిరి రిజర్వాయర్ లో 2 టిఎంసి ల నీళ్ళున్నాయని సోమశిల జలాశయం నుంచి సంగం బ్యారేజి ద్వారా కనిగిరి రిజర్వాయర్ కు 500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుందన్నారు. సోమశిల డ్యామ్ లో దాదాపు 66 టిఎంసి లకు పైగానే నీటి నిల్వలున్న నేపథ్యంలో నెల్లూరు డెల్టా ప్రాంత రైతాంగానికి ఎటువంటి సాగునీటి సమస్యలు రావని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కనిగిరి రిజర్వాయర్ ఆధునీకరించి పర్యాటక కేంద్రగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీ యిచ్చారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి పాళెం మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, బుచ్చి మండల టిడిపి అర్బన్, రూరల్ మండల అధ్యక్షులు ఎంవి శేషయ్య, యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, ఏటూరి శివరామ కృష్ణా రెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

ప్రభాకర రెడ్డిని సగౌరవంగా ఆహ్వానించకపోవడంపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అందరి తరపున క్షమాపణలు చెప్పారు. ప్రజాప్రతినిధుల పట్ల అగౌరవంగా వ్యవహరిస్తే ఊరుకోమని, ప్రజాప్రతినిధులను తప్పకుండా గౌరవించాలన్నారు. ఎంపీ వేమిరెడ్డి విషయంలో పశ్చాత్తాప పడుతున్నాం, అందరం బాధను వ్యక్తీకరిస్తున్నామన్నారు. ఇలాంటి లోపాలు మళ్ళీ జరగకుండా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**త్వరలో జిల్లాలో ఎయిర్పోర్టు : మంత్రి నారాయణ**

దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పోర్టులు, ఎయిర్పోర్టులు అవసరమని, వీల్కెనంత త్వరలో దగదర్తిలో ఎయిర్పోర్టు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు, ఇందుకు ఢిల్లీలో చర్చించామని, కమిటీ కూడా పరిశీలనలకు మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొచ్చి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా అన్నారు. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుపై ఎస్పీకి ఆదేశాలిచ్చామని, చింతారె డ్డిపాలెం, కనుపర్తిపాడు కూడళ్ల వద్ద ఫ్లైఓవర్ వంతెల నిర్మాణానికి ఇప్పటికే ఎన్హెచ్ అధికారులతో చర్చించినట్లు చెప్పారు.

**జిల్లాలో వేగంగా అభివృద్ధి పనులు : కలెక్టర్ ఆనంద్**

జిల్లాలో వివిధ శాఖల ద్వారా అభివృద్ధి పనులు వేగంగా చేపడుతున్నట్లు కలెక్టర్ ఆనంద్ చెప్పారు. పల్లె పండుగలో భాగంగా గ్రామాల్లో ఉపాధిహామీ పనులు, ఆర్డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో జల్జీవన్ మిషన్ పనులు, ఆర్అండ్బి శాఖ ద్వారా రోడ్లను మరమ్మతులు చేపడుతూ గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నట్లు కలెక్టర్ చెప్పారు. గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు నియోజకవర్గానికి 80 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు 43 కోట్లు జిల్లాకు మంజూరైనట్లు చెప్పారు. జల్ జీవన్ మిషన్ ద్వారా తాగునీటి రక్షిత మంచినీటి పథకాలను నిర్మించి పంచాయతీలకు అప్పగించడం జరుగుతుందని, వీటి నిర్వహణను పంచాయతీలు చూసుకోవాలని చెప్పారు. ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు లేని గిరిజనులను పదివేల మందిని గుర్తించి, వీరికి స్పెషల్ డ్రైవ్ ద్వారా గత మూడునెలల్లో సుమారు వెయ్యిమందికి కార్డులు ఇప్పించామని, వీటిపై కూడా పూర్తిస్థాయిలో సమీక్ష చేస్తామని కలెక్టర్ చెప్పారు. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల ఏపిఐఐసి భూములకు సంబంధించి రైతులకు నగదు చెల్లింపు చేయడం జరిగిందని, దీనికి అటవీశాఖ అభ్యంతరాలున్న దృష్ట్యా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ చెప్పారు.

**గత ఐదేళ్లలో అక్రమాలకు విచారణ చేపట్టండి : ఎమ్మెల్యే సోమిరెడ్డి**

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇరిగేషనన పనులపై విచారణ చేపట్టాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహననరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ యాంత్రీకరణను నిర్లక్ష్యం చేసిందన్నారు. గత ఐదేళ్లలో ఎన్ని నీటిగుంటలు తవ్వారో, ఎన్ని సూక్ష్మ బిందు సేద్య పరికరాలు ఎంతమందికి ఇచ్చారో, ఎన్ని నిధులు ఖర్చు చేశారో తెలపాలని అధికారులను నిలదీశారు. గిరిజనులు ఆధార్ కార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నారని తన నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రత్యేక క్యాంపులు పెట్టి ఆధార్ కార్డులు ఇవ్వాలని ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు.

**లష్కర్లకు జీతాలు ఇవ్వండి : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**

జిల్లాలో ఇరిగేషన్శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న లష్కర్లకు జీతాలు ఇవ్వడం లేదని, కొంతమందిని తొలగిస్తున్నారని, ఈ చిరుద్యోగులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. సాగునీటి సంఘాలకు ఎన్నికల నిర్వహించనున్న దృష్ట్యా ఓటర్ల జాబితాను సక్రమంగా తయారుచేయాలని అధికారులకు సూచించారు. కోవూరులో ఇరిగేషన్ పనులకు 6.30 కోట్లు మాత్రమే మంజూరు చేశారని, మరింత ఎక్కువ నిధులు కేటాయించి కాలువల్లో పూడికతీత పనులును ఎక్కువగా చేపట్టాలన్నారు.

**నెల్లూరు రూరల్లో మూడు బ్రిడ్జిల నిర్మించేందుకు చర్యలు చేపట్టండి : ఎమ్మెల్యే కోటంరెడ్డి**

నెల్లూరు పరిధిలో ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉండేందుకు పొట్టేపాలెం కలుజు వద్ద, కొత్తూరు సమీపంలోని తెలుగుగంగ కార్యాలయం వద్ద, నెల్లూరు సమీపంలో ఇరుగాళమ్మ కూడలి వద్ద వంతెనలను నిర్మించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కోరారు. ఈ మూడు వంతెనలను నిర్మించేందుకు కృషి చేయాలని మంత్రులను కోరారు. ఆమంచర్ల వద్ద ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు 562 ఎకరాలను సేకరించి రైతులకు 50 కోట్ల మేర పరిహారం కూడా చెల్లించడం జరిగిందని, ఫారెస్టు డిపార్టుమెంటు చెబుతున్న అడ్డంకులపై మంత్రులు, కలెక్టర్ దృష్టిసారించి ఈ పారిశ్రామికవాడను పూర్తిచేస్తే సుమారు 10వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని కోటంరెడ్డి చెప్పారు. కొమ్మలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు.

**రాళ్లపాడుకు 1.5 టిఎంసిల నీటిని విడుదల చేయాలి : కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి**

సోమశిల జలాశయం నుంచి రాళ్లపాడు రిజర్వాయర్కు 1.5 టిఎంసిల నీటిని విడుదల చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ప్రతిసారి అర టిఎంసి మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారని, ఈసారి 1.5 టిఎంసిలను విడుదల చేస్తే రాళ్లపాడు ఆయకట్టు కింద రైతాంగం వరిసాగు చేసేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు.

**యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టండి : ఎమ్మెల్యే కృష్ణారెడ్డి**

జిల్లాలో పిఎసిఎస్లు, మార్క్ఫెడ్ల ద్వారా యూరియా సరఫరా చేయాలని, బయటమార్కెట్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అన్నారు. వర్షాలకు చెరువులన్నీ నిండాయని, మేజర్ ఇరిగేషన్ పనులపై దృష్టిసారించాలని సూచించారు. లష్కర్లకు ఓఅండ్ఎం ఫండ్స్ నుంచి జీతాలు ఇవ్వాలని, ఎఫ్డిఆర్, ఓఅండ్ఎంకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. దెబ్బతిన్న కలుజులకు మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పరిశ్రమలు తెచ్చేది చంద్రబాబు అని, అభివృద్ధి చేసేది చంద్రబాబేనన్నారు.

ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, శాసనమండలి సభ్యులు తూమాటి మాధవరావు, పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బల్లి కల్యాణ్ చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, ఇన్చార్జి డిఆర్వో అనూష, జడ్పీ సిఇవో జె.మోహన్రావు, సిపివో ఎస్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, ఇరిగేషన్ , ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈలు వెంకటరమణారెడ్డి, దేశాయ్నాయక్, గంగాధర్, వెంకటరమణ, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, డిఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజాకుమారి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగా భవాని, ఆత్మకూరు ఆర్డీవో పావని తదితరులు పాల్గొన్నారు.